సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 10 । మార్చి । 2024



ఎయిర్ పోర్టుకు కొత్త శోభ
కడప విమానాశ్రయం కొత్త శోభను సంత రించుకుంటోంది. న్యూ టర్మినల్ భవన నిర్మాణం, ఇతర పనులకు శ్రీకారం చుట్టేం దుకు టెండర్లను పిలిచారు. -IIలో



కనుల పండువగా కామాక్షి త్రేతేశ్వరుని కల్యాణం
అత్తిరాలలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. -IIలో



యజమాని ఇంటికే కన్నం
యజమానికి కొన్నేళ్లుగా నమ్మకంగా ఉం టూ..అన్నం పెడుతున్న ఇంటికే కన్నం వేసిన కారుడ్రైవర్ కటకటాల పాలైన సంఘటన శనివారం జరిగింది. -IIలో

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ సిబ్బంది

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయంలో శనివారం మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మూలవిరాట్‌కు అభిషేకం జరిపారు. పట్టు వస్త్రాలు, పూలమాలలతో సుందరంగా అలం కరించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో తెల్లవారుజాము నుంచే స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

11న ఇన్‌స్పైర్ పోటీలు



రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ప్రాజెక్టుల పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాయచోటి: ఈనెల 11 నుంచి రాష్ట్రస్థాయి ఇన్ స్పైర్ మనాక్ పోటీలను చిత్తూరు జిల్లా పల మనేరులో నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి శనివారం తెలి పారు. ఈ పోటీలకు అన్నమయ్య జిల్లా నుంచి 21 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. గత నెల 12వ తేదిన రాయచోటిలోని డైట్ ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన 21 మంది విద్యార్థులను నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సభ్యులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థులు తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ప్రదర్శించాలన్నారు. గైడ్ టీచర్లు, విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పోటీలలో తప్పనిసరిగా పాల్గొ నేలా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యా యులు చొరవచూపాలన్నారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శనివారం డీఈఓ మర్రెడ్డి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్స్‌గా పనిచేస్తున్న వారికి స్కూల్ అసి స్టెంట్స్ (స్పెషల్ ఎడ్యుకేషన్)గా పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా అర్హులైన వారికి సంబంధించిన సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. ఇందులో భాగంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఆరుగురు సెకెండరీ గ్రేడ్ టీచర్స్‌కు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు.కార్యక్రమంలో డీఈఓ మర్రెడ్డి అనురాధ, ఏడీ మునీర్‌ఖాన్, సిబ్బంది నాగేశ్వ రెడ్డి, ఏసన్న, విశ్వనాథరెడ్డిలు పాల్గొన్నారు.

అభ్యర్థిని మార్చకుంటే టీడీపీ గల్లంతే



తంబళ్లపల్లెలో శంకర్ వర్గీయుల నిరసన ప్రదర్శన

తంబళ్లపల్లె:తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిని మార్చ కుంటే పార్టీకి పుట్టగతులు ఉండవని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులు అగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం తంబళ్ల పల్లెలో శంకర్ వర్గీయులు నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి నిర్వహించిన నిరసన ప్రదర్శనలో శంకర్‌కు న్యాయం చేయా లంటూ నినాదాలు చేసారు. పార్టీలో ఏ రోజు పనిచేయని వ్యక్తి జయచంద్రారెడ్డికి టికెట్ ఎలా ప్రకటిస్తారని నిలదీశారు. పార్టీ నాయ కులు, సీనియర్లు అభిప్రాయాలు,సర్వేలను పరిగణలోకి తీసుకోకుండా అధిష్టానం నిర్ణ యం తీసుకోవడం తంబళ్లపల్లెలో టీడీపీకి సమాధి చేసినట్లేనని స్పష్టం చేసారు. వాస్తవా లను తెలుసుకుని శంకర్‌కు టికెట్ ప్రకటించా లని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ రామ చంద్ర, నాయకులు బేరిశీనా పాల్గొన్నారు.

అరబిందో సమేత



నిత్య సేవక

ఆయనకు కష్టమంటే ఇష్టం.. ఆ ఇష్టమే ఆయన్ను ముందుకు నడిపించింది. ఎంతెత్తుకు ఎదిగినా ఒదిగి ఉండడం ఆయన వ్యక్తిత్వం. ఆ వ్యక్తిత్వమే మహానుభావుడిగా మార్చింది. ఇక తను పుట్టిన నేలన్నా.. మట్టి మనుషులన్నా బోలెడు ప్రేమ. ఆ ప్రేమే సామాజిక సేవ వైపు నడిపించింది. ఆయనే.. తనవంతు బాధ్యతగా సొంతూరు సేవలో తరిస్తున్న శ్రీమంతుడు అరబిందో ఫార్మా అధినేత నిత్యానంద రెడ్డి.

- పుట్టిన నేలకు సేవ చేస్తున్న పారిశ్రామికవేత్త
- కార్పొరేట్ సామాజిక బాధ్యతగా అనేక సామాజిక కార్యక్రమాలు

సాక్షి, కడప డెస్క్: కృషి ఉంటే మనుషులు రుషులవు తారు, మహాపురుషులవుతారు. తరతరాలకు తరగని వెలుగవుతారు, ఇలవేలుపులవుతారు' అన్నాడో సినీ కవి. ఆ మాటలకు ప్రాణం పోస్తే ప్రముఖ ఫార్మా సంస్థ అధినేత నిత్యానంద రెడ్డి రూపం సాక్షాత్కరిస్తుందంటే అతిశయోక్తి కాదు. ఫార్మా రంగంలో దేశంలోనే అగ్రగామి సంస్థల్లో అర బిందో ఫార్మాస్యూటికల్స్ సంస్థ ఒకటి. ఒక ఫార్మా సంస్థకు అధిపతిగా ప్రస్తుతం ఆయనకున్న గుర్తింపు ఊరికే రాలేదు. ఆయన జీవితం వడ్డించిన విస్తరి కాదు. దాని వెనుక కొన్నేళ్ల కఠోర శ్రమ దాగుంది. అలుపెరుగని పట్టుదలే ముందుకు నడిపించింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కేవీపల్లెలో మారుమూల ప్రాంతమైన గోరంట్లపల్లెలో జన్మిం చిన ఆయన అనేక ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. అనేక కష్టనష్టాలకోర్చి ఇంతింతై వటుడింతై అన్నట్లు మహావృక్షంగా ఎదిగారు. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలు మరిచిపోకూడదన్న ఆలోచనతో తన ప్రాంతాన్ని, తన ప్రాంతంలోని ప్రజలను ఆదుకోవా లని, వారి సమగ్రాభివృద్ధికి ఏదైనా చేయాలన్న తలంపుతో ముందుకు సాగుతున్నారు. తాను కష్టపడి సంపాదించిన దానిలో కొంత సామాజిక సేవకు ఉపయోగిస్తున్న తీరు అందరికీ ఆదర్శప్రా యం. తన సంస్థకు చెందిన కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పీలేరు ప్రాంతంలోని రైతాంగా నికి అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గోరంట్లపల్లె శ్రీమంతుడిగా ఖ్యాతి గడించారు.



నిత్యానంద రెడ్డి

ఆయన సామాజిక సేవా కార్యక్రమాల్లో కొన్ని...

- 2021 మార్చి 10వ తేదీన **అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా** 26 మంది మహిళా **పాడి** రైతులకు గడ్డి కత్తిరించే యంత్రాలను పంపిణీ చేశారు.
- కలికిరి కేవీకేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 90 మంది మహిళలకు 45 రోజుల కోడిపిల్లలను ఒక్కక్కరికి 20 చొప్పున పంపి**ణీ** చేశారు. మహిళలు ఆర్థికంగా **ఎదగ**డానికి ఈ అవకాశాన్ని అం**దిపుచ్చుకో**వాలని ఆయన కోరారు.
- అనుబంధ జీవనోపాధుల పెంపుదల కార్యక్రమంలో భాగంగా ఒంటరి మహిళలకు పెయ్య దూడలు, పొట్టేలు పిల్లలను పంపిణీ చేశారు. 5 మంది మహిళలకు పెయ్య దూడలు, 5 మంది మహిళలకు పొట్టేలు పిల్లలను పంపిణీ చేశారు.
- 2019లో వచ్చిన కరువును దృష్టిలో పెట్టుకుని 2020, 2021 సంవత్సరాల్లో 300 మంది పాడి రైతులకు సూపర్ నేపియర్ పశుగ్రాస విత్తనాలను అందజేశారు. రైతు రత్నశేఖర రెడ్డి ద్వారా విత్తనాన్ని అభివృద్ధి చేసి పంపిణీ చేశారు. అదే విధంగా వేసవిలో మొక్కజొన్న, జొన్న విత్తనాలను 520 మంది రైతులకు అందజేశారు. కొత్త రకం గడ్డి స్మార్ట్ నేపియర్, దశరథ గడ్డి విత్తనాన్ని 25 మంది రైతులకు పంపిణీ చేసి.. పీలేరు, దాని చుట్టుపక్కల మండలాల్లోని పాడి రైతులకు విత్తనాన్ని అందుబాటులోకి **తీసుకురా**వడం విశేషం.
- 2020 నుంచి పీలేరు, **కేవీ**పల్లె, కలికిరి మండలాల్లోని గ్రామాలలో ఉచిత పశువైద్య ద్వారా శిబిరాలను ఏర్పాటు చేశారు. ఉచితంగా నట్టల నివారణ మందు, పిడుదలను నివారిస్తూ స్ప్రేయింగ్, **మి**నరల్ మిక్చర్, కట్టని ఆవు**లకు** చికిత్స అందిస్తుండడం **విశేషం. ఈ** శిబిరాల ద్వారా 12 వేల **పశువులకు చికిత్స** అందించారు.
- అరబిందో ఫార్మా ద్వారా రైతు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు తక్కువ ధరకే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, ఆవులకు కావలసిన పశువుల దాన, పశువుల మందులు అందిస్తున్నారు. సంఘంలోని 750 మంది రైతులకే కాకుండా చుట్టుపక్కల మండలాల్లోని రైతులకు కూడా అందిస్తున్నారు.
- పెరటి తోట పెంపకం కింద 700 మంది కుటుంబాలకు 15 రకాల కూరగాయలు, ఆకు కూర విత్తనాలను సరఫరా చేయడం జరిగింది. అలాగే 550 మంది రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.



పెరటి తోటల పెంపకం కోసం చేయూతనిచ్చిన అరబిందో ఫార్మా ఫౌండేషన్



పీలేరు మండలంలో పేదలకు పొట్టేళ్లను అందజేస్తున్న అరబిందో ఫార్మ ఫౌండేషన్ సభ్యులు

- ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత రక్షిత మంచి నీటి సరఫరా చేశారు. పీలేరు మండలంలోని 22 ప్రభుత్వ పాఠశాలలు, 2 జూనియర్ కళాశాలలు, 8 అంగన్వాడీ కేంద్రాలు,ఒక ఆశ్రమానికి ప్రతిరోజూ ఉచితంగా వారికి సరిపడినంత సురక్షిత తాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ చేయూతనిస్తోంది.
- పీలేరు ఎఫ్‌బీవో ద్వారా రైతులకు కావాల్సిన యంత్ర పరికరాలను బయటి కంటే తక్కువ అద్దెతో రైతులకు దున్నడానికి ఇస్తున్నారు. ఇప్పటివరకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ ద్వారా 30 లక్షల విలువ గల ట్రాక్టర్లు, మడకలు అందజేశారు.
- ఇటీవల తన సొంతూరులో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు.
- 2019 నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే క్రమంలో దాదాపు 50 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఉచితంగానే అందించారు.

ఇంటర్న్‌షిప్



వివిధ డిగ్రీ, పీజీ విద్యార్థినీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద ఎఫ్‌పీవో ద్వారా జరుగుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నారు. ఇప్పటివరకు ఏపీ మాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎఫ్ పి ఓలలో దాదాపు 15 మందికి అకౌంటెంట్, సీఈవోలుగా ఉద్యోగ అవకాశం కల్పించారు.

విద్యార్థులకు చేయూత



పీలేరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలను విద్యార్థులకు పుస్తకాలు అందించడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు కనీస వసతులు కల్పించారు. గూడరేపల్లి ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ , రెండు తరగతి గదులు, ప్రభుత్వ బాలికల పాఠశాలలకు ఆటస్థల నిర్మాణం చేశారు. కంప్యూటర్స్, బెంచీలు వితరణ చేయడం విశేషం.

ఉన్నత కల.. సాకారమైన వేళ





నూతన పాఠశాల తరగతి గదులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి సలహాదారులు ఆర్ ధనుంజయరెడ్డి (ఫైల్), కొత్త తరగతి గదుల్లో నవ్వులు చిందిస్తున్న విద్యార్థులు

- రూ.3 కోట్లు నాడు–నేడుతో ఉన్నత పాఠశాల భవనాలు
- సీఎం సలహాదారు ఆర్. ధనుంజరెడ్డి ప్రత్యేక చొరవ
- అటవీ శివారు పల్లెల విద్యార్థులకు చదువు కష్టాలు దూరం

ఓబులవారిపల్లె: మారుమూల గ్రామాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య చేరువైంది. ఉన్నత విద్యకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి సలహాదారులు ఆర్ ధనుంజయరెడ్డి ప్రత్యేక చొరవ.. సీఎం వైఎస్ జగన్ సహకారంతో అటవీ శివారు పల్లెల విద్యార్థుల ఉన్నత విద్య కల సాకారమైంది. ఈ నెల 11న ప్రారంభం కానున్నాయి.

తల్లిదండ్రుల హర్షం: అటవీ శివారు గ్రామాలైన గాదెల, కొత్తపల్లె, తల్లెంవారిపల్లె, ఎస్టీకాలనీ, నూకన పల్లె, తల్లెంవారిపల్లె, కృష్ణంపల్లె తదితర గ్రామాల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలంటే పట్టణాలకు, మండల కేంద్రానికి కిలో మీటర్ల మేర వెళ్లాల్సి వస్తుండేది. ఆడపిల్లలను అంత దూరం పంపించలేక, సౌకర్యాలు లేక చాలా మంది చదువులను మధ్యలోనే ఆపేసే పరిస్థితులు ఉండేవి. ఈ పరిస్థితులను తెలుసుకున్న సీఎం సలహాదారు ధనుంజయరెడ్డి తల్లెంవారిపల్లె గ్రామానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంజూరయ్యేలా చొరవ చూపారు. ప్రస్తుతం పాఠశాలలో దాదాపు 221 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీనిపై విద్యార్థుల తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత పాఠశాల నూతన భవనం సిద్ధం...

తల్లెంవారిపల్లె గ్రామంలో ఉన్న పాడుపడిన పాత పాఠశాల భవనాల స్థానంలో కొత్త భవనాలు రూపుదిద్దుకున్నాయి. దాదాపు మూడు కోట్ల రూపాయల నాడు–నేడు నిధులతో ఉన్నత పాఠశాల నూతన భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు.

దశాబ్దాల కల సాకారం

గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె గ్రామంలో దశాబ్దాలుగా పక్కా రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు రెండు కోట్ల రూపాయల వ్యయంతో తల్లెంవారిపల్లె నుంచి గాదెల వెంకటాపురం , గాదెల కొత్తపల్లెకి పక్కా సీసీ రోడ్లు వేశారు. దీంతో గ్రామస్తుల దశాబ్దాల కల సాకారమైంది.

11న ప్రారంభం: తల్లెంవారిపల్లె జిల్లా పరిషత్‌ఉన్న పాఠశాల నూతన భవనాలతో పాటు పలు అభివృద్ధి పనులను ఈ నెల 11న మంత్రుల, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రారంభించనున్నారు. మంత్రులు పెద్దిరెడ్డి , బొత్స సత్యనారాయణ, ఎంపీ మిథున్‌రెడ్డి, విప్ కొరముట్ల తదితరులు హాజరుకానున్నారు.

పాఠశాల నిర్మించినందుకు కృతజ్ఞతలు



పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, సీఎం సలహాదారులు ఆర్ ధనుంజయరెడ్డికి కృతజ్ఞతలు . అదే విధంగా పాఠశాల నిర్మాణం కోసం సహకరించి అన్ని శాఖల అధికారులకు ధన్యవాదాలు. –షేక్ షాయిదుల్లా, ప్రధానోపాధ్యాయులు, జెడ్పీహెచ్‌ఎస్, తల్లెంవారిపల్లె

ఊరికి దగ్గరగా ఉన్నత పాఠశాల



గతంలో పాఠశాలకు వెళ్లాలంటే మండల కేంద్రానికి దాదాపు ఆరు కిలో మీటర్లు ప్రతి రోజుల వెళ్లాల్సి వచ్చేది. ఒంటరిగా వెళ్లాలంటే భయంగా ఉండేది. ఇప్పుడు మా గ్రామంలోనే ఉన్నత పాఠశాల నిర్మించడం సంతోషంగా ఉంది. – పీ లక్ష్మి ప్రసన్న, పదవతరగతి, గాదెల, ఓబులవారిపల్లె

రోడ్డు కల సాకారం



తల్లెంవారిపల్లె గ్రామానికి గాదెల, వెంటాపురం, కొత్త పల్లె గ్రామాల నుంచి దారులు ఉన్నాయి. అయితే కంపచెట్లు పిచ్చి మొక్కలు మొలచి గ్రామానికి వచ్చేందుకు సరైన దారి కూడ లేకుండా పోయింది. ధనుంజయరెడ్డి గ్రామానికి ఉన్న ప్రధాన రహదారులకు సిమెంటు రోడ్లు వేయించడం సంతోషం. –అమర్‌నాథరెడ్డి, తల్లెంవారిల్లె

రేపు వైఎస్‌ఆర్ జిల్లాలో సీఎం పర్యటన



కడప సెవెన్ రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11 తేదీ వైఎస్‌ఆర్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. పులివెందులలో సీఎం వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తారు.

- సోమవారం ఉదయం 10.20 కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.25కు హెలికాప్టర్‌లో బయలు దేరి 10.40 పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.45కు అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలు దేరి 10.55కు డాక్టర్ వైఎస్‌ఆర్ గవర్నమెంట్ హాస్పిటల్ వద్దకు చేరుకుంటారు. 11.35 వరకు డాక్టర్ వైఎస్‌ఆర్ ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- 11.35 రోడ్డు మార్గాన బయలు దేరి 11.45కు బనాన ఇంటి గ్రేటిడ్ ప్యాక్ హౌస్ వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ప్యాక్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గడుపుతారు.
- అనంతరం అక్కడి నుంచి బయలు దేరి 12.10 డాక్టర్ వైఎస్‌ఆర్ మినీ సెక్రటేరియట్ కాంప్లెక్స్ వద్దకు చేరుకుంటారు. 12.25 వరకు కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గడుపుతారు.
- 12.25కు అక్కడ బయలుదేరి 12.30 డాక్టర్ వైఎస్‌ఆర్ జంక్షన్ వద్దకు చేరుకొని 12.35 వరకు ఆ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- 12.35 నుంచి 12.40 వరకు సెంట్రల్‌బోలే వార్డు ప్రారంభిస్తారు. అనంతరం 12.50కి వైఎస్ జయమ్మ షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు చేరుకొని ఒంటి గంట వరకు కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడ బయలు దేరి 1.05కు గాంధీ జంక్షన్ చేరుకొని 1.10 వరకు జంక్షన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి బయలు దేరి 1.15 డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ వద్దకు చేరుకొని 1.40 వరకు దాన్ని ప్రారంభోత్సవ కార్యక్రమంలో గడుపుతారు.
- అనంతరం 1.50కి ఆదిత్య బిర్లా యూనిట్ వద్దకు చేరుకుంటారు. 2.05 వరకు ఆదిత్య బిర్లా యూనిట్ ఫేస్–1ప్రారంభోత్సవంలో గడుపుతారు.
- అనంతరం అక్కడ బయలు దేరి సమ్యూ గ్లాస్ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 2.15కు హెలిక్టాపర్‌లో బయలు దేరి 2.25కు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 2.30కి రోడ్డు మార్గాన బయలు దేరి 2.35కు వైఎస్‌ఆర్ మెమోరియల్ పార్క్ వద్దకు చేరుకుంటారు. 2.55 వరకు పార్క్‌ను ప్రారంభిస్తారు.
- అ తర్వాత అక్కడి నుంచి బయలు దేరి 3.00 గెస్ట్ హౌస్ చేరుకుంటారు. సాయంత్రం 4 గంటల వరకు రిజర్వ్
- సాయంత్రం 4కు గెస్ట్‌హౌస్ బయల్దేరి 4.05 ఇడుపుల పాయ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 4.10కి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరి 4.25కు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.
- 4.35కు కడప ఎయిర్ పోర్ట్ నుంచి విమానంలో బయలు దేరి 5.25కు గన్నవరం ఎయిర్ పోర్ట్ చేరుకుంటారు.
- 5.30 అక్కడి నుంచి రోడ్డు మార్గాన 5.50కి ముఖ్యమంత్రి అధికార నివాసానికి చేరుకుంటారు.

పులివెందులకే తలమానికం మెడికల్ కాలేజ్

పులివెందుల: పులివెందులలో రేపు (సోమవారం) ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్న వైఎస్సార్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మెడికల్ కళాశాల పులివెందులకే తలమానికంగా చెప్పుకోవచ్చు. దివంగత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో పులివెందుల్లో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని భావించారు. ఇంతలో విధి వక్రీకరించి ఆయన దూరమయ్యారు. నేడు ఆయన కలను ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. సోమవారం ముఖ్యమంత్రి మెడికల్ కళాశాలతో పాటు పులివెందుల్లో నూతనంగా నిర్మించిన బనానా ప్యాక్ హౌస్, మినీ సెక్రటేరియట్, సెంట్రల్ బోలేవార్డును ప్రారంభించనున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ కలహాలతో ఓ యువకుడు గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.... పట్టణంలోని బెంగళూరు రోడ్డు, కుమారపురానికి చెందిన బాబి మటన్ అంగడి ద్వారా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ కలహాలతో విసుగెత్తిన బాబి ఇంట్లోనే గొంతు, శరీరభాగాలపై విచక్షణారహితంగా కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలిపోయిన గుర్రం'కొండలు'



కాలిపోతున్న గుర్రంకొండలు

గుర్రంకొండ : గుర్రంకొండలోని ఇందిరమ్మ కాలనీకి వైనుకవైపు ఉన్న మిడిమాలపు కొండలు (గుర్రంకొండలు) మొత్తం కాలిపోయాయి. గత శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కాలనీ పరిసరాల్లోని కొండలకు కావాలనే నిప్పు అంటించారు. మంటలు చిలికిచిలికి గాలివానాలా మారి మొత్తం కొండలను కాల్చి బూడిద చేశాయి. వెయ్యి ఎకరాల్లో అడవులు, వృక్ష సంపద, జంతువులు కాలిపోయాయి. రాత్రిళ్లు కొండంతా మంటలు ఎగిసిపడుతూనే ఉన్నాయి. ఎర్రటి నిప్పు కణాలు గాలికి ఎగసి పడుతూ బీభత్సం సృష్టించాయి. కాలనీ ఇళ్లకు వైనుకవైపు ఈ సంఘటన చోటు చేసుకోవడంతో కాలనీ వాసులు భయభ్రాంతులయ్యారు.

వ్యక్తి దారుణ హత్య

పెండ్లిమర్రి : మండలంలోని ఎం.చౌటపల్లె గ్రామానికి చెందిన ఎస్.చిన్న వెంకటేష్(64) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మృతదేహాన్ని పెట్రోల్ పోసి కాల్చివేశారు. ఈ సంఘటన రెండు రోజుల క్రితం జరిగింది. శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... చిన్నవెంకటేష్ రెండు రోజుల క్రితం రాత్రి పొలం వద్ద నూగు పంట నూర్పిడికి వెళ్లాడు. అదే రోజు రాత్రి అతన్ని అక్కడే హత్య చేసి సమీపంలోని పొలాలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి, కంప కట్టెలతో కాల్చివేశారు. మృతుని ముఖం పూర్తిగా కాలిపోయింది. స్థానికులు శనివారం కాలిపోయిన మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడు ఒక్కడే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. కుమారుడు కడపలో ఉన్నాడు. కుమార్తైలకు వివాహం చేశాడు. మృతుని కుమారుడు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదులో పాత గొడవల కారణంగా అదే గ్రామానికి చెందిన కొందరు తమ తండ్రిని హత్య చేసి ఉంటారని తెలిపాడు.

ఎయిర్ పోర్టుకు కొత్త శోభ

- ఇప్పటికే రూపురేఖలు మారిన కడప ఎయిర్‌పోర్టు
- రూ.266 కోట్లతో నూతన టర్మినల్ భవనానికి శంకుస్థాపన
- నేడు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- హాజరుకానున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, ఇతర అధికారులు
- ఎంపీ అవినాష్‌రెడ్డి కృషి ఫలితంగా ఒనగూరుతున్న సౌకర్యాలు



ఎయిర్‌పోర్టు న్యూ డొమెస్టిక్ టెర్మినల్ భవనం నమూనా

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప విమానాశ్రయం సరికొత్త శోభను సంతరించుకుంటోంది. అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. రూ. 266 కోట్లతో న్యూ టర్మినల్ భవన నిర్మాణంతో పాటు ఇతర పనులకు శ్రీకారం చుట్టేందుకు టెండర్లను కూడా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా పిలిచింది. ఈ నేపథ్యంలో న్యూ టర్మినల్ భవన నిర్మాణానికి ప్రధాన మంత్రి మోదీ వర్చువల్ విధానంలో ఆదివారం ఉదయం 11 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య, యూనియన్ మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ సివిల్ ఏవియేషన్ రోడ్ ట్రాన్స్‌పోర్టు జనరల్ విజయ్‌కుమార్ సింగ్, పలువురు రాజ్యసభ సభ్యులు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమానికి కడప ఎయిర్ పోర్టు నుంచి కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సుజిత్‌కుమార్ పొద్దర్ తెలిపారు. తిరుపతి, విజయవాడ, రాజమండ్రి తరహాలో కడప ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం రూ. 266 కోట్లతో న్యూ డొమెస్టిక్ టెర్మినల్ భవన నిర్మాణంతోపాటు మూడు ఏరో బ్రిడ్జిలు నిర్మించనున్నారు. అంతేకాకుండా అత్యాధునిక సౌకర్యాలతో ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దారు.

రూ. 266 కోట్లతో న్యూ టర్మినల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఇటీవల ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా కడప ఎయిర్‌పోర్టు అభివృద్ధికి రూ. 266 కోట్ల నిధులను కేటాయించింది. ప్రధానంగా ఈ మొత్తంతో 16, 455 చదరపు మీటర్లలో న్యూ డొమెస్టిక్ టెర్మినల్ భవన నిర్మాణంతోపాటు మూడు ఏరో బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఏరో బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే టెర్మినల్ భవనం నుంచి నేరుగా విమానంలోకి చేరుకునే అవకాశం ఉంటుంది. వర్షం వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణికులు విమానం వద్దకు చేరుకోవచ్చు. ప్రస్తుతం బస్సు ద్వారా ప్రయాణికులు అక్కడికి చేరుకుంటున్నారు.

అత్యాధునిక సౌకర్యాలు

కడప విమానాశ్రయాన్ని అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు మార్గం సుగమమైంది. ఇందుకు సంబంధించి నిధులు విడుదల కావడంతో పనులు త్వరగా చేపట్టి పూర్తి చేసేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు అడుగులు వేశారు. ఆధునిక సౌకర్యాలంటే ఎస్కలేటర్, అధునాతనమైన లిఫ్ట్, సెంట్రలైజ్డ్ ఏసీ, బ్యాగేజీ కన్వేయర్ బెల్ట్, మూడు ఏరో బ్రిడ్జిలు, టెర్మినల్ భవనం, ఇతరత్రా పనులను చేపట్టనున్నారు. అంతేకాకుండా న్యూ కారు పార్కింగ్, అప్రోచ్‌రోడ్లు, బ్యూటిఫికేషన్, సెంట్రల్ లైటింగ్ పనులు కూడా చేపట్టనున్నారు.

పెద్ద విమానాలు వచ్చేందుకు అవకాశం

కడప విమానాశ్రయంలో పెద్ద విమానాలు రాకపోకలు సాగించేందుకు అనుకూలమైన రన్‌వేను అభివృద్ధి చేశారు. పనులు పూర్తయితే పెద్ద విమానాలు ఇక్కడ దిగేందుకు అన్ని వసతులు ఉన్నాయి. ఇప్పటికే నైట్ ల్యాండింగ్‌కు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అనుమతి వచ్చిన తర్వాత పనులన్నీ పూర్తయ్యాయి. రన్‌వే పెంపుతోపాటు రన్‌వే లైటింగ్, అప్రోచ్ లైటింగ్, పార్కింగ్ బే లైటింగ్, 2.5 కిలో మీటర్ల రన్‌వే, సెక్యూరిటీ, పెరిమీటర్ లైటింగ్, పెరిమీటరు రోడ్డు తదితర సౌకర్యాలన్నీ కూడా విమానాశ్రయంలో పూర్తయ్యాయి. దీంతో నైట్ ల్యాండింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా విమానాలు దిగేందుకు అవకాశం ఉంటుంది.

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రత్యేక కృషి

కడప ఎయిర్‌పోర్టు అభివృద్ధి విషయంలో పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వస్తున్నారు. ఎప్పటికప్పుడు ఎయిర్ పోర్టు విస్తరణ మొదలుకొని ఫారెస్ట్ అనుమతులతో పాటు కొండల్లో సిగ్నల్ లైట్ల విషయంలోను ప్రత్యేక చొరవ కనబరిచారు. కేంద్ర మంత్రులతో పాటు విమానయాన శాఖ అధికారులతోను ఎప్పటికప్పుడు చర్చిస్తూ ఎయిర్‌పోర్టు పురోగాభివృద్ధిలో ప్రత్యేక పాత్ర పోషించారు. ఒకనాడు అంతంత మాత్రంగా సౌకర్యాలతో ఉన్న ఎయిర్ పోర్టు ఈనాడు ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పథంలో పయనిస్తుందంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషి ఫలితమేనని చెప్పక తప్పదు.

కొత్త టెర్మినల్ భవనంతో 700 మంది ప్రయాణికులకు సౌకర్యం

కొత్త డొమెస్టిక్ టెర్మినల్ భవనం పూర్తయితే 700 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు కడప విమానాశ్రయంలో అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న టెర్మినల్ భవనం ద్వారా 40+40 (80) మందికి మాత్రమే అవకాశం ఉంది. ఏడు విమానాలు పార్కింగ్ చేసేందుకు కడప విమానాశ్రయంలో స్టాండ్‌లను ఏర్పాటు చేశారు. అభివృద్ధి పనులు పూర్తయితే ఏ-320 (180మంది) ప్రయాణించే పెద్ద విమానాలు ఇక్కడి నుంచి నడిపేందుకు వీలు ఉంటుంది. ప్రస్తుతం 70 మంది సామర్థ్యం ఉన్న విమానాలు మాత్రమే నడుస్తున్నాయి.

కనుల పండువగా కామాక్షి త్రేతేశ్వరుని కల్యాణం

– ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మేడా



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే మేడా, నాయకులు

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజు నిర్వహించిన శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. మండల పరిధిలోని అత్తిరాలలో ఆదివారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి, ఆలయ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ వెలగచెర్ల గంగిరెడ్డిలతో కలిసి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. ఎమ్మెల్యేకు ఆలయ ఈఓ జి.కొండారెడ్డి, చైర్మన్ వి.వెంకటసుబ్బారెడ్డి, ధర్మకర్తలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కల్యాణంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కామాక్షిదేవి, త్రేతేశ్వరస్వామి వార్లను పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక ఆసనంపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలతో ఆలయ ప్రధాన అర్చకులు కె. పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ

కృష్ణచైతన్య అన్నదాన ట్రస్ట్(కువైట్) ఆధ్వర్యంలో గత 3 రోజుల నుంచి అత్తిరాల పుణ్యక్షేత్రంలో భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ట్రస్ట్ ప్రతినిధులు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. అనంతరం వారి సేవలను కొనియాడారు.

మల్లయ్య కొండపై నృత్యాభిషేకం



మల్లయ్య కొండపై గాయత్రి, అలీఫా నృత్య ప్రదర్శన

కురబలకోట : శివరాత్రి వేడుకల సందర్భంగా అంగళ్లు మల్లయ్యకొండపై శుక్రవారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా సాగింది. అంతకు ముందు మదనపల్లెకు చెందిన మౌనిక భరత నాట్యం అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మదనపల్లికి చెందిన విద్యార్థులు గాయత్రి, అలీఫా కూడా అక్కడి రంగ మండపంలో కూచిపూడి నాట్యం చక్కగా ప్రదర్శించారు. ఓం నమశ్శివాయ..చంద్రకళాధర సహృదయ, దేవీ సవితా దేవి గానం, ప్రాణము నీవే..అనే పాటలకు జనం నీరాజనాలు పలికారు. ఇద్దరి అభినయానికి చూపరులు మంత్ర ముగ్ధులయ్యారు. వీరికి జ్ఞాపికలను బహుకరించి ఆలయ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ఘనంగా సన్మానించారు. శనివారం ఉదయం కొండపై భారీ కర్పూరహారతి, అన్నదానం నిర్వహించారు. ముదివేడు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వివిధ ప్రాంతాల్లో జూదరుల అరెస్టు

బి.కొత్తకోట : స్థానికంగా ఉన్న పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 36 మందిని అరెస్టు చేశామని సీఐ సూర్యనారాయణ తెలిపారు. శనివారం తెల్లవారుజామున వివిధ ప్రాంతాల్లో పేకాట జూదం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడులు జరిపారు. ఈ దాడుల్లో భారీ నగదు దొరికింది. మండలంలోని కాండ్లమడుగులో జరుగుతున్న జూదంపై దాడి చేసి ఏడుగురిని, స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దాడిచేసి 10 మందిని, తాకాటం వారిపల్లె వద్ద జరిపిన దాడిలో 19 మందిని అరెస్టు చేశామని తెలిపారు. రూ.4,27,150 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

మదనపల్లె : పట్టణంలోని వన్‌టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో జూదం ఆడుతున్న 53 మందిని అరెస్ట్ చేసి, రూ.2లక్షల 43వేల 300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐలు వలీబాషు, ఎస్.శేఖర్‌లు తెలిపారు. శనివారం ఆయా పోలీస్ స్టేషన్‌లలో అరెస్ట్‌కు సంబంధించిన వివరాలు తెలిపారు. వన్‌టౌన్ పరిధిలోని కోటవీధి, అమ్మినేనివీధి తదితర ప్రాంతాల్లో పోలీసులు జరిపిన దాడుల్లో ఒకచోట 14 మందిని అరెస్ట్ చేసి రూ.15,300, మరోచోట 8 మందిని అరెస్ట్ చేసి రూ.69,000 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వలిబాషు తెలిపారు. తాలూకా సీఐ ఎస్.శేఖర్ మాట్లాడుతూ.. మదనపల్లె మండలంలోని సీటీఎం, పోతబోలు, దుబ్బిగానిపల్లె పంచాయతీల్లోని గ్రామాల్లో పోలీసులు జరిపిన దాడుల్లో 31 మందిని అరెస్ట్ చేసి రూ.1,59,000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదం ఆడుతూ అరెస్టయిన వారిపై ఏపీ గేమింగ్, గ్యాంబ్లింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

నిమ్మనపల్లె : జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని రెడ్డివారి పల్లి పంచాయతీ సోమానుపల్లె కాలనీలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం అర్ధరాత్రి సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో జూదం ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.14,110 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణయ్య, సిబ్బంది శివ, రెడ్డి బాషా, రాజశేఖర్ పాల్గొన్నారు.

యజమాని ఇంటికే కన్నం వేసిన కారుడ్రైవర్

- డూప్లికేట్ తాళం చెవితో దర్జాగా ఇంట్లో చోరీ
- నిందితుడి అరెస్ట్, రూ.2లక్షల80వేల నగదు స్వాధీనం



చోరీకి పాల్పడిన కారుడ్రైవర్ అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ ఎస్.శేఖర్

మదనపల్లె : యజమానికి కొన్నేళ్లుగా నమ్మకంగా ఉంటూ, ఇంటి తాళం చెవిని దొంగిలించి, అన్నం పెడుతున్న ఇంటికే కన్నం వేసిన కారుడ్రైవర్ కటకటాల పాలైన సంఘటన శనివారం జరిగింది. శనివారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ ఎస్.శేఖర్‌తో కలిసి చోరీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ పుంగనూరువాండ్లపల్లెకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్. కె.వెంకటరెడ్డి(పుంగనూరుగాంధీ) ఇంట్లో చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం అడవినాథుని కుంటకు చెందిన సందిరెడ్డిగారి చంద్రశేఖర్‌రెడ్డి కొన్నేళ్లుగా కారుడ్రైవర్‌గా పనిచేస్తూ నమ్మకంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంటికి సంబంధించిన డూప్లికేట్ తాళాన్ని దొంగిలించి, గత ఏడాది జూన్‌లో ఇంటిలో ఎవరూ లేని సమయంలో రూ.2,40,000 దొంగిలించుకెళ్లాడు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 24న మరోసారి ఇంటిలోకి వెళ్లి రూ.40వేలు చోరీ చేశాడు. దీంతో వరుస చోరీలపై ప్రొఫెసర్ వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా సీఐ ఎస్.శేఖర్, ఎస్‌ఐ రవికుమార్‌లతో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణలో కారు డ్రైవర్ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు గుర్తించి, శనివారం మధ్యాహ్నం మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో నిందితుడిని అరెస్ట్‌చేసి, నగదును స్వాధీనం చేసుకున్నారు. తాలూకా పోలీస్ స్టేషన్‌లో క్రైమ్‌నెం.147/2024, ఐపీసీ 457, 380 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన క్రైమ్‌పార్టీ మహమ్మద్, జయచంద్ర, ప్రభాకర్, నరసింహులు, రాఘవ తదితరులను డీఎస్పీ ప్రసాదరెడ్డి అభినందించారు.

ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



రాజకీయ పార్టీల నాయకుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి : త్వరలో జరగనున్న జమిలి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారం అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం సాధారణ ఎన్నికలు-2024, ఓటర్ల జాబితా, సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలపై ఓటర్ల జాబితాలో, ఎన్నికలకు సంబంధించిన ఇతర ఏ అంశాలపైన, ఏవైనా ఫిర్యాదులు చేస్తే వాటిని త్వరితగతిన పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఎన్నికలకు సంబంధించిన నోడల్ అధికారులకు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయిలో కూడా శిక్షణా తరగతులను నిర్వహించి ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించిన ఆర్‌ఓలకు, తహసీల్దార్లకు గత రెండు వారాల క్రితం శిక్షణ పూర్తయిందని తెలిపారు. కౌంటింగ్ హాల్స్‌పై కూడా తగిన సమీక్షను నిర్వహిస్తామన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం స్ట్రాంగ్ రూముల భద్రత పటిష్టంగా ఉండాలి

రాయచోటి : ఈవీఎం స్ట్రాంగ్ రూముల భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను శనివారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల భద్రత అత్యంత పటిష్టంగా పకడ్బందీగా ఉండాలని, ఎటువంటి లోపాలు ఉండకూడదన్నారు. స్ట్రాంగ్ రూములకు ఎక్కువ ద్వారాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాయచోటి ఇంజినీరింగ్ కళాశాలలో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఇక్కడ స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేశామన్నారు. కళాశాల చుట్టూ ఖాళీ స్థలం ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఏఎస్పీ రాజ్‌కమల్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

– 12513 మందికి 11851 మంది విద్యార్థులు హాజరు
– డీఐఈఓ కృష్ణయ్య

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో శనివారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. శనివారం జిల్లాలో 54 పరీక్షా కేంద్రాలలో 12513 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. వీరిలో 11851 మంది విద్యార్థులు హాజరు కాగా 662 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్య చెప్పారు. మొదటి సంవత్సరం ఇంటర్ జనరల్ పరీక్షలకు 11140 మంది విద్యార్థులకు 10613 మంది పరీక్షలు రాశారు. 527 మంది హాజరు కాలేదు. ఒకేషనల్ పరీక్షకు 1373 మంది విద్యార్థులకు 123 మంది విద్యార్థులు శనివారం పరీక్షలకు హాజరయ్యారు. 135 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ తెలిపారు.

పూరిగుడిసె దగ్ధం

– కట్టుబట్టలతో మిగిలిన దంపతులు



సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన దంపతులు

నిమ్మనపల్లె : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదంలో పూరిగుడిసె దగ్ధమైంది. అందులో నివాసం ఉంటున్న దంపతులు కట్టుబట్టలతో మిగిలారు. శుక్రవారం రాత్రి మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ గుండ్ల బురుజు మాదిగ పల్లెలో అగ్ని ప్రమాద సంఘటన జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న బి. వేణుగోపాల్, అరుణ దంపతులు కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేయడంతో పూరి గుడిసెలో ఉంటూ పక్కా గృహం కొంతవరకు నిర్మాణం చేశారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దంపతులిద్దరూ శ్రీ నీల మల్లేశ్వర స్వామి ఆలయానికి రాత్రి జాగరణకు వెళ్లారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు అధికమై పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు ఎంత ప్రయత్నించినా నష్టాన్ని నివారించలేకపోయారు. ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు, దుస్తులు, ధ్రువపత్రాలు, దాదాపు 20 గ్రాముల మేర బంగారు నగలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో దంపతులిద్దరూ కట్టుబట్టలతో మిగిలారు. ప్రభుత్వం తమను ఆదుకొని సాయం చేయాలని కోరారు.

టీడీపీ, జనసేనలకు సొంతంగా పోటీచేసే ధైర్యం లేదు

- రాయచోటిలో వైఎస్సార్‌సీపీలోకి భారీగా మైనార్టీల వలసలు
- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



పార్టీలో చేరిన మైనార్టీ నాయకులతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : టీడీపీ, జనసేన పార్టీలకు సొంతంగా పోటీ చేసే ధైర్యం లేకనే బీజేపీ పెద్దలు అమిత్‌షా అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు కాస్తున్నారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు లక్ష్మీ థియేటర్ వెనుక వీధులకు చెందిన వంద కుటుంబాల మైనార్టీలు టీడీపీని వీడి జిల్లా వైఎస్సార్‌సీపీ విభాగం మైనార్టీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, కౌన్సిలర్ అల్తాఫ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మైనార్టీ నాయకులు అఫ్సర్, అబ్దుల్‌ఖాదర్, ముబారక్‌బాషా, ఖాదర్‌బాషా, మహమ్మద్‌ఆలీ, జబీవుల్లా, అఫన్, ఖాదర్, మస్తాన్, బాషా, ఖాజ, ఆరీఫ్, నాసిర్, మహబూబ్ బాషా, అన్సర్‌ఆలీబాషా తదితరులు ఉన్నారు.

సైదియా థియేటర్ వెనుక వీధిలో 50 కుటుంబాలు చేరిక

పట్టణంలోని సైదియా థియేటర్ వెనుక భాగం ఇషాక్ మసీదు వీధిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మన్సూర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో 50 కుటుంబాలు చేరాయి. పార్టీలో చేరిన వారిలో కటిక షేక్ మన్సూర్‌ఆలీ, షేక్ సద్దాం, షేక్ ఇంతియాజ్, జుహైర్‌ఖాన్, సయ్యద్ షమీర్, వంశీకృష్ణ, షేక్ ఆసీఫ్, షేక్ రిజ్వాన్, షేక్ వాహిద్, షేక్ జియా, షేక్ అఫ్సాన్, షేక్ తౌసీఫ్, షేక్ సాదిక్ తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేసుకోగలిగామన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాలు గడప గడపకు చేరవేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచి ప్రతి ఒక్కరికీ వైద్యం అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలు మాఫీ చేయగలిగామన్నారు. రాయచోటిని జిల్లా కేంద్రం చేసి కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను చేసి చూపించామన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని జగన్‌మోహన్‌రెడ్డిని మరొకసారి సీఎంగా చేయాలని వారు కోరారు. స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హరూన్‌బాషా, రియాజ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రియాజుర్‌రెహమాన్, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, ఇర్ఫాన్, అన్నా సలీం, మాజీ కోఆప్షన్ జాఫర్‌ఆలీఖాన్ పాల్గొన్నారు.